ఆ రహదారి ప్రయాణం.. నరకప్రాయం

- పెద్దపెద్ద గోతులతో ప్రయాణికుల అవస్థలు
- నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి అధ్వానం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ప్రధానరోడ్డు మార్గం ధ్వంసం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అడుగడుగునా గోతులతో ప్రయాణం ఇబ్బందిగా మారుతుంది. ఏజెన్సీ గ్రామాలను కలిపే రోడ్డు మార్గాల్లో పట్టణం నుంచి వెళ్లే శ్రీనివాసపురం రోడ్డు మార్గం ఒకటి. ఈ రోడ్డు మార్గం భారీ స్థాయి గోతులతో నరకంగా మారింది. పట్టణంలో రద్దీగా ఉండే రోడ్డు మార్గాల్లో శ్రీనివాసపురం రోడ్డు మార్గం ఒకటి. ఈ మార్గం బుట్టాయగూడెం మండలంలోని ఏజెన్సీ గ్రామాలను కలుపుతుంది. నిత్యం ఏజెన్సీ ప్రాంతాల నుంచి ప్రజలు జంగారెడ్డిగూడెం పట్టణం ఈ రహదారి గుండానే ప్రయాణిస్తారు. అలాగే మండలంలోని ప్రధాన గ్రామాలైన అక్కంపేట, శ్రీనివాసపురం, మైసన్నగూడెం, పట్టెన్నపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు సైతం ఏ అవసరం వచ్చినా జంగారెడ్డిగూడెం రావాల్సిందే. చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రధాన పట్టణంగా ఉన్న జంగారెడ్డిగూడేనికి ప్రజలు ఏదో ఒక పని మీద వస్తూనే ఉంటారు.

ఈ రోడ్డు మార్గంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు

ఇదే రోడ్డు మార్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలతో పాటు, 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సైతం ఉంది. అలాగే బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, రిజిస్ట్రేషన్ కార్యాలయం ఈ మార్గంలో ఉండటంతో ప్రజలతో నిత్యం ఈ రహదారి రద్దీగా ఉంటుంది. అయితే ఈ రహదారి లక్ష్మీనారాయణ థియేటర్, తాండ్రపాపారాయుడు సెంటర్, సీఎస్ఆర్ మాల్, కాలేజ్‌రోడ్డు జంక్షన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి వద్ద ఇలా అడుగడుగునా పెద్దపెద్ద గోతులతో నిండిపోయింది. కార్లు, ద్విచక్ర వాహనమే కాదు చివరికి సైకిల్‌పై వెళ్లే వారికి సైతం ఈ రోడ్డు అసౌకర్యంగానే ఉంటుంది. ఏళ్ల తరబడి రోడ్డు అధ్వానంగా ఉంది. అలాగే వాహనాలు ప్రయాణించే సమయంలో అధ్వాన్నం ఉన్న రోడ్డు నుంచి మట్టి ఎగిసిపడి రోడ్డు వెంబడి ఉన్న నివాసాలు, వ్యాపార సముదాయాల్లోకి చేరుతోంది. దీంతో ప్రజలు దుమ్ముతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్రీనివాసపురం రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


పట్టణంలో అధ్వానంగా ఉన్న శ్రీనివాసపురం రహదారి


తాండ్రపాపారాయుడు సెంటర్‌లో గోతులతో అధ్వానంగా ఉన్న రహదారి

రహదారి నిర్మించాలి



పట్టణంలోని శ్రీనివాసపురం రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో ప్రయాణం నరకంగా మారింది. మోటార్‌సైకిల్‌పై కూడా వెళ్లలేని విధంగా అడుగడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. వాహనాలు ప్రయాణించే సమయంలో రోడ్డుపై దుమ్ము ఎగసిపడటంతో శ్వాసకోస ఇబ్బందులు కూడా ఎదురవుతున్నాయి. అధికారులు రహదారి పరిస్థితిని పరిశీలించి రోడ్డును నిర్మించాలి.

టి.కరుణ వరప్రసాద్, జంగారెడ్డిగూడెం

ఏళ్లుగా ఇదే పరిస్థితి



ఏళ్ల తరబడి పట్టణంలోని శ్రీనివాసపురం రోడ్డు పరిస్థితి ఇలానే ఉంది. చుట్టుపక్కల ప్రాంతాలకు ప్రధాన కేంద్రంగా జంగారెడ్డిగూడెం ఉంది. ముఖ్యంగా మండలంలోని ప్రధాన గ్రామాలతో పాటు బుట్టాయగూడెం మండలంలోని ఏజెన్సీ గ్రామాలకు ప్రధాన రహదారిగా ఉంది. ప్రజల ఇబ్బందులను పరిశీలించి రోడ్డుకు మోక్షం కల్పించాలి.

ర్యాలీ వెంకటాచారి, జంగారెడ్డిగూడెం

క్లుప్తంగా

ముమ్మరంగా వాహన తనిఖీలు


వాహన తనిఖీలు నిర్వహిస్తున్న రవాణా శాఖ అధికారులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో రవాణా శాఖాధికారులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏలూరు నుంచి వచ్చిన ప్రత్యేక బృందం పట్టణంలో తనిఖీలు నిర్వహించినట్లు ఎంవీఐ ఎండీ మదని తెలిపారు. పట్టణంలోని స్కూల్ బస్సులు, దిచక్ర వాహనాలు, నాలుగుచక్రాల వాహనాలను బృందం తనిఖీ చేసిందన్నారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని, హెల్మెట్ లేని, అలాగే టాక్స్ కట్టని వారిపై కేసులు నమోదు చేశామన్నారు. మంగళవారం వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఈ తనిఖీల్లో హెల్మెట్ లేని 25 మందిపై, టాక్స్ కట్టని 13మందిపై, ఇతర నేరాల్లో 28 మందిపై, మొత్తం 66 మందిపై కేసు నమోదు చేసి, రూ.2లక్షల వరకు జరిమానా విధించామని ఎంవీఐ మదని తెలిపారు. ఈ దాడుల్లో ప్రత్యేక బృందంతో పాటు జంగారెడ్డిగూడెం రవాణా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి


ఆందోళన చేస్తున్న ఏపీ ఆశా వర్కర్లు

కొయ్యలగూడెం: ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, బీమా సౌకర్యంతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారానికి జీవోలను విడుదల చేయాలని నవంబర్ 18 జిల్లా కలెక్టరేట్ల ముట్టడికి పిలుపునిచ్చామన్నారు. కార్యక్రమంలో డి.విజయ, కె.వెంకటలక్ష్మి, వై.విజయ, కోమలి, ఎం.గంగారత్నం, ఎం.సంతోష, డి.తులసి, అరుణ రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గర్జనను జయప్రదం చేయాలి

బుట్టాయగూడెం: ఈ నెల 16వ తేదీన బుట్టాయగూడెంలో జరిగే ఆదివాసీ గర్జనను జయప్రదం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు కోరారు. మండలంలోని దొరమామిడి పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఆదివాసీ సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తెల్లం లక్ష్మణరావు, సోదెం ముక్కయ్య, సర్పంచ్‌లు తెల్లం రాముడు, కుంజా వెంకటేశ్వరరావు, జోడే సత్యదుర్గాప్రసాద్, మాల్చి వెంకన్నబాబు, ఐన్నే బుచ్చిరాజు, తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణం చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న జమ్మి శ్రీనివాస్

కొయ్యలగూడెం: గ్రామీణ ప్రాంతాల్లో నూతన రహదారులను నిర్మించాలని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో కనకాద్రిపురం గ్రామంలో మంగళవారం ఎల్లిబోయిన లక్ష్మి అధ్యక్షతన సమావేశానికి హాజరైన జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, రహదారులపై ఏర్పడిన గోతులకు మరమ్మతులు చేసి నూతన రహదారులు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్.నారాయణ, గుడె శ్రీను, రాపోలు బాస్కరావు, సంపంగి అప్పారావు, వామిశెట్టి సత్యదుర్గ, ఎస్.పెద్దులు, దుర్గమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పశుగణన పోస్టర్ల ఆవిష్కరణ

కొయ్యలగూడెం: 21వ అఖిల భారత పశుగణన పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం రాజవరం గ్రామంలో నిర్వహించారు. సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు ఏలేటి చిన్న తుక్కయ్య ముఖ్య అతిథిగా పాల్గొని పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగణన వలన రైతులకు లబ్ధి కలుగుతుందని అదే విధంగా పాడి సంస్థలను అభివృద్ధి చేసుకోవచ్చని సూచించారు. అనంతరం రైతులు, గోపాల మిత్రలతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రామచంద్రరావు, వార్డు సభ్యులు కె.రేఖ, కె.నాగలక్ష్మి, నాయకులు బల్లె కేసుబాబు, బి.బాబురావు, వెటర్నరీ అసిస్టెంట్లు కె.వెంకట్రాజు, అపురూప. సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకాలువ మిగులు భూములు పేదలకు ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం: ఎర్రకాలువ సాగు భూములకు ఏక్ సాల్ పట్టాలు ఇవ్వాలని, పంటలకు రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. పేదలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, సాగు పంటలకు రక్షణ కల్పించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డివిజనల్ ఇరిగేషన్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు భూస్వాములు ఏకమై పేదలు సాగు చేసుకుంటున్న పంటలను ధ్వంసం చేసి పేదలపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం మిగలు భూములు పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు మడకం సుధారాణి, అందుగుల ప్రభాకర్, అనుమలు మురళి, యాగంటి సీత, ఎం.కుమారి, మంగమ్మ, కుమారి, రామలక్ష్మి, చెల్లమ్మ, దుర్గమ్మ, సూర్యారావు, గాంధీ, రాజు, దళితులు, గిరిజనులు పాల్గొన్నారు.

సీపీఐ నేత చంద్రన్న వర్ధంతి

వేలేరుపాడు: మండలంలోని రెడ్డిగూడెంలో కామ్రేడ్ చంద్రన్న వర్ధంతిని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. చంద్రన్న స్థూపం వద్ద ఆయన సతీమణి బ్రహ్మమ్మ కొవ్వొత్తులు వెలిగించి పూలతో సత్కరించారు. సీపీఐ నాయకులు సి.లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నాయకులు సిరికొండ రామారావు పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.

సోషల్ మీడియా కార్యకర్తల జోలికొస్తే సహించం


మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: సోషల్ మీడియా కార్యకర్తల జోలికి వస్తే సహించమని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హెచ్చరించారు. మండలంలోని దుద్దుకూరులో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అవినీతి, పాలనా వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయాలని చూడటం దుర్మార్గమైన చర్యన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలు అధైర్య పడొద్దని వారికి అన్ని వేళలా అండగా ఉంటామన్నారు. పోలీసుల వేధింపులకు, ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు తలొగ్గేదిలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా లాఅండ్ఆర్డర్‌ను గాలికి వదిలేసి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపితే అక్రమ కేసులు పెడతారా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలమయ్యాయని వాటి నుంచి ప్రజలను దృష్టి మళ్లించడం కోసం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు అవుతుందన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం, అరెస్ట్ చెయ్యడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భీమడోలు సీఐ విల్సన్

ద్వారకాతిరుమల: రక్షణ చట్టాలపై మహిళలు, మైనర్ బాలికలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని భీమడోలు సీఐ యూజే విల్సన్ సూచించారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం సైబర్ నేరాలు, పోక్సో యాక్ట్, మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే దుష్పరిణామాలపై విద్యార్థినులకు సీఐ విల్సన్, ఎస్సై టి.సుధీర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విల్సన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను వినియోగించినా, కలిగి ఉన్నా, విక్రయించినా, రవాణా చేసినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మీ చుట్టు పక్కల జరిగే అన్యాయాలు, అసాంఘిక కార్యకలాపాలను దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో గాని, 112 నెంబర్‌కు కాల్ చేసి గాని తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ బి.రాణి తదితరులున్నారు.

మద్ది క్షేత్రానికి పోటెత్తిన భక్తులు


భక్తులతో కిటకిటలాడుతున్న గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయం

జంగారెడ్డిగూడెం రూరల్: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసంలో తొలి మంగళవారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో ఉదయం ప్రాతఃకాలార్చనతో మొదలుకొని తోమాల సేవ, గోపూజ, నిత్య హోమ బలిహరణలు వేదపారాయణలు, ఉత్సవమూర్తులకు విశేష అష్టోత్తరపూజలు, వేదపారాయణలు అర్చకులు నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రీతికరమైన తమలపాకులతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవల రూపేణ రూ.2,95,636 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. సుమారు 4000 మంది భక్తులకు స్వామి వారి నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు. శ్రీస్వామి వారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పర్యవేక్షించారు.

పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కుక్కునూరు: రైంతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ మంగళవారం సీపీఐఎంఎల్ ప్రజాపంథా మండల కమిటీ కార్యాలయంలో ఏఐపీకేఎస్ రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కే గౌస్ మాట్లాడుతూ, రైతాంగ సమస్యలపై స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు పత్తి క్వింటాల్‌కు రూ8.500,వరికి రూ.5వేలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐపీకేఎస్ రాష్ట్ర నాయకులు సిరికొండ రామరావు, బాసినేని సత్యనారాయణ, గడ్డల ముత్యాలరావు, జిల్లా డివిజన్ నాయకలు కట్టం వీరస్వామి, కంగాల కల్లయ్య, మచ్చా లక్ష్మయ్య, కొలూరి రత్తయ్య, ఎం.సుజాత, మడివి లక్ష్మయ్య, అడమయ్య, తదితరులు పాల్గొన్నారు.

అశోక్ శ్రీనివాస్ మృతి తీరని లోటు


శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కోటగిరి శ్రీధర్‌బాబు, కొఠారు అబ్బయ్య చౌదరి

కామవరపుకోట: మేడవరపు అశోక్ శ్రీనివాస్ మృతి వైఎస్సార్‌సీపీకి, ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటని మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు, దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కళ్ల చెరువుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత మేడవరపు అశోక్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను మంగళవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అశోక్ శ్రీనివాస్ వైఎస్సార్‌సీపీకి విధేయుడిగా ఉంటూ, పార్టీ పటిష్టతకు ఎనలేని కృషి చేశారన్నారు. 2019లో సార్వత్రిక ఎన్నికల్లో చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి గెలుపుకు ఎనలేని కృషి చేశారన్నారు. ఈ ప్రాంత ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారికి అందుబాటులో ఉంటూ సొంత నిధులతో సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. జెడ్పీటీసీ కడిమి రమేష్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మేడూరి రంగబాబు, కామిరెడ్డి నాని, జానంపేట బాబు, ముంగర సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు

కొయ్యలగూడెం: నాగుల చవితి పర్వదినం సందర్భంగా మంగళవారం ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రధాన వేడుకలలో ఒకటైన నాగుల చవితి పురస్కరించుకుని రైతాంగ కుటుంబాలు సామూహికంగా పుట్టల వద్దకు వెళ్లి పాలు పోశారు. ప్రఖ్యాతిగాంచిన బయ్యన్నగూడెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తీకమాసం సందర్భంగా పూజలు నిర్వహించి అన్న సమారాధన చేశారు.

బుట్టాయగూడెం: ఏజెన్సీప్రాంతంలో ఘనంగా నాగుల చవితి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే మహిళలు పుట్టలో పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని మర్లగూడెం అటవీప్రాంతంలో పుట్టలో పాలు పొయ్యడానికి బారులు తీరారు.

పోలవరం రూరల్: నాగుల చవితి సందర్భంగా మహిళలు పుట్టల వద్ద భక్తిశ్రద్ధలతో నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల సమీపంలో దేవాలయాల వద్ద గల పుట్ల వద్దకు చేరుకుని పూజాద్రవ్యాలతో పూజలు నిర్వహించారు. పూలతో అలంకరించారు. స్థానికంగా ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయాలకు చేరుకుని భక్తులకు పూజలు నిర్వహించుకున్నారు.


కొయ్యలగూడెం: నాగేంద్రుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


బుట్టాయగూడెం: అటవీప్రాంతంలోని పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

ఘనంగా నాగుల చవితి వేడుకలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజలు నాగుల చవితి సందర్భంగా పుట్టలో పాలుపోసి నాగేంద్రుడికి పూజలు నిర్వహించారు. ప్రజలు ఉదయానే పూజా ద్రవ్యాలు చేతబూని పుట్టలను వెతుకుతూ సందడిగా కనిపించారు.

ద్వారకాతిరుమల: మండలంలోని వాడవాడలా నాగులచవితి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే పుట్టల వద్దకు చేరుకుని ఎంతో భక్తి ప్రపత్తులతో పుట్టల్లో పాలు పోశారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున భక్తులు ఉదయాన్నే శ్రీవారి కొండపైన పుట్ట వద్దకు చేరుకుని, పుట్టలో పాలు పోశారు.

నాగేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు

కామవరపుకోట: స్థానిక గుర్రాల చెరువు వద్ద ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద నాగుల చవితి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ సుదర్శన రామదుర్గ కుమారాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయాన్ని సందర్శించుకుని ఆలయం ప్రాంగణంలో ఉన్న పుట్ట వద్ద నాగేంద్ర స్వామి వార్లకు పాలాభిషేకం నిర్వహించారు.


కామవరపుకోట: పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ద్వారకాతిరుమల: కొండపైన పుట్టలో పాలు పోస్తున్న భక్తులు


పోలవరం రూరల్: పుట్ట వద్ద పాలు పోస్తున్న భక్తులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.సుమలత అన్నారు. మంగళవారం మక్కినవారిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ గోపాలరావు ప్రారంభించారు. సర్పంచ్ గోపాలం మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఏవో మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు టి.నరసాపురం, మధ్యాహ్నపువారిగూడెం, మల్లుకుంట, కె.జగ్గవరం సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మక్కినవారిగూడెం సహకార సంఘం సీఈవో సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

59 కేంద్రాల ఏర్పాటు

జంగారెడ్డిగూడెం: రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని 10 మండల్లాల్లో 59 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో ఎంవీ రమణ తెలిపారు. ఆయా రైతుసేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. రైతులు వరి కోతల అనంతరం రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకుని తేమ 17 శాతం లోపు ఉండేలా చూసుకుని తమ ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకోవాలని కోరారు. గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాలకు రూ.2320, సాధారణ రకం ధాన్యానికి రూ.2300 పొందవచ్చని తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలంలో 14, కొయ్యలగూడెం 10, బుట్టాయగూడెం 5, జీలుగుమిల్లు 3, కుక్కునూరు 4, పోలవరం 6, వేలేరుపాడు 2, కామవరపుకోట 4, ద్వారకాతిరుమల 6, టి.నరాసాపురం మండలంలో 5, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చింతలపూడి: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయ పరపతి సంఘం ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వుంగళవారం ఆయన ప్రారంభించారు. జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబుల్లా, వూజీ ఏఎంసీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, సొసైటీ సీఈవో ఎంవీఆర్ఎల్ బాలకృష్ణ , వ్యవసాయశాఖ ఏడీ బి.నాగకుమార్, ఏవో మీనాకుమారి, తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

హమాలీల వేతన బకాయిలు విడుదల చేయాలి

కుక్కునూరు: హమాలీల వేతన బకాయిలు విడుదల చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జీసీసీ కార్యాలయం ఎదుట హమాలీలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో హమాలీలు తిరోజుల సురేష్, కడారి తిరపతయ్య, నెరబ్రోయిన సాయిరాం, శ్రీను, నాగరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించాలి

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా అనేక పంటలు రైతులకు లబ్ది చేకూర్చే విధంగా ఉన్నాయని ఏవో చెన్నకేశవులు పేర్కొన్నారు. బోడిగూడెం పంచాయతీ వద్ద బుధవారం రైతులకు నిర్వహించిన ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని మలసానికుంటలో కోడి పందేల స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 6 గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.13,800 నగదు, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం: పేకాట స్థావరంపై జంగారెడ్డిగూడెం ఎస్సై షేక్ జబీర్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. స్థానిక ఉప్పలమెట్టలో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి, నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.4150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.